# ఘుర్ ఘుర్
# మెదివాలీ

రెండెడ్ల బండి మీద "షావుకారు" సినిమా కెళ్ళాం గుర్తుందీ?

ఎండు గడ్డి ఒత్తుగా వేసి ఎంప్రెస్ మిల్సు కొత్త దుప్పటి పరిచి అమ్మాయిగార్ని. అబ్బాయి గార్ని పువ్వుల్లా నలక్కుండా కూకో పెట్టి తీసుకెళ్ళి తీసుకొస్తానన్నాడు బండెంకట సుబ్బుడు.

దారిలో ఆకలేస్తే తినడానికి జీళ్ళు. చేగోడీలు పాకం పట్టిన గోధుమ గవ్వలు. దాహం వేస్తే గొంతుకెండి పోకుండా మంచి నీళ్ళ

కోసం మరచెంబు యిచ్చి, బండి రోడ్డెక్కేవరకూ కాలవగట్టు దాకా నడిచి "జాగ్రత్తగా వెళ్ళిరండి" అంటూ పెర్రి ఆపేక్షతో సాగనంపేది మా అమ్మ.

ఆ కాలువ నీళ్ళ చల్లదనం, ఆ గాలిలోని హాయి, ఆ చెట్ల క్రింద మువ్వలు చప్పుడు చేసుకుంటూ పరిగెత్తే రెండెడ్ల బండి దూకుడు, ఆ వేళ మనల్ని ఆశీర్వదించి నెత్తిమీద నుంచి చల్ల చల్లగా మెల్ల మెల్లగా సాగిపోయిన నీలి మబ్బులు- పావలా యిస్తేనేకాని గయోపాఖ్యానంలోని పద్యాలు పాడుకుంటూ బండి వెనకాల మన కూడా రావటం మానని పాలేరు కుర్రాడు, అప్పుడా సినిమాలో తెలుగు కన్నెపిల్ల సొగసు లన్నీ చూపించి మురిపించిన "షావుకారు జానకి కాబోలు పాడిన: ఇంటింట ఆనంద దీపావళీ- మా యింట శోకాంత తిమిరావళీ" అనే పాట. తిరిగి వచ్చేటప్పుడు బండెంకట సుబ్బడ్ని అడిగి చెర్నాకోలు తీసుకుని నేను రెండెంట్ల బండిని తోలితే మీ కళ్ళు ఆకాశంలో నక్షత్రాలా మెరిసిన వైనం అప్పుడు పూలపందిరిలా కనిపించిన జీవితం ఆ క్షణాలు ఎందుకో గుర్తుకువస్తే__

"నాటిరోజులిక రావిక రావిక రావు నెచ్చలీ!" అనిపిస్తో వుంటుంది.

"దీపాలు వెలిగించడర్రా పిల్లలూ-" అని మా అమ్మ దొడ్లోంచి కేకేస్తే నేను మీ కేసిచూశా__

"వస్తారా! ఎంచక్కా అరుగుమీద దీపాలు వెలిగిద్దాం" అని.

ఆ వేళ నేను చమురుపోస్తూంటె ప్రమిదల్లో కూడాకూడా అరుగు చుట్టూ తిరిగి మీరు దీపాలు వెలిగించారు.

దీపంతో దీపాన్ని వెలిగించు —

ఎంత చిన్నదీపమైనా వెలిగిస్తే దాన్తో ఎటువంటి చీకట్లనైనా పటాపంచలు చెయ్యొచ్చు!

నా కోసం మా నాన్న ఉప్పుపొట్లంకట్టాడు.

నేను సత్యభామలా నడుంబిగించి మా యింటి ముందు ఉప్పు పొట్లం త్రిప్పుతూంటే రోడ్డమీద ఉప్పుపొట్లం త్రిప్పుతూంటే - ఇదేదో రౌడీలా గుందే అని అనుకోనివుంటారు మీరు నా సంగతి తెలీక-

అతనేం కాలుస్తాడో కనుక్కోవే అంటే అగ్గిపెట్టె కాలుస్తా రన్నాను. అంతా నవ్వారు. అందుకు మీ కోపం వచ్చింది.

కోపమంటే జ్ఞాపక మొచ్చింది.

దీపావళికి వర్షం వస్తుందంటారు. వర్షం వస్తుందోరాదో నాకు తెలీదుకాని ప్రతి దీపావళికి మా నాన్నకు కోపం వస్తూ వుంటుంది. అందుకే దాన్ని "దీపావళికోపం" అంటారు మాయింట్లో

"టపాకాయలు కాల్చమంటే కాల్చాల్సిందే- నాకు భయం! అమ్మో -" అంటే మా నాన్నకు చెడ్డకోపం వస్తుంది? హైరానా పడి పోయి తిట్టి కొట్టినంత పనిచేస్తాడు.

నెల్లాళ్ళముందునుంచీ తాటాకులు చీరటం. గుల్లలు పండబెట్ట డం. ముగ్గు జల్లించడం. మైదా పిండి వుడక పెట్టి గొట్టాలు చెయ్యడం. కుంపటి పగలకొట్టి కాకరపువ్వొత్తులు ఎర్రగా పడటానికి రజను చేసుకో వడం. ఎవరికీ యింట్లో తీరుబడి వుండేదికాదు. అటం సీక్రెట్లలా పాళ్ళు ఒకరికొకరు చెప్పుకోవడం-అరుగులమీద గట్టిగా కేకలు తిట్టుకోడాలూ ఓహ్-అయె దివాలీ అంటే చెప్పలేని హడావిడి. ఆడపిల్లనైనా మొ

పిల్లాడివైనా ఏకైకపుత్రికను నేనేకనుక-మతాబులు కాల్పించినా చిచ్చుబుడ్లు వెలిగించినా, సిసింద్రీలు విసిరినా, జువ్వలు ఎగరేసినా అన్నీ నా చేతే కాల్పించేవాడు. నాకు భయం పోవడం కోసం నాచుట్టూ పదిమంది పిల్లల్ని ప్రోగుచేసి వాళ్ళందరిచేత తిట్టి కొట్టి కాల్పించేవాడు. అందుకే మా ఊళ్లో పెళ్ళియీడు పిల్లలందరికి నేనే లీడర్ని. ఆ వేళ నేను జువ్వలు విసిరేస్తూంటే మీరు ఆశ్చర్యంతో తెల్లబోయి చూశారు. మిమ్మల్ని కాల్చమంటే జెంటిల్మానులా మొహం పెట్టి వద్దులే వద్దులే అని తప్పించుకున్నారు. అప్పుడు మా వీధిలో గసల్సంతా దీని మొగుడు పిరికి అనుకున్నారని మీకు కోపం వచ్చింది.

అలా పదిరోజులు అరుగుమీద కూర్చునిటపాకాయలు కాల్చుకుంటూ, కారాకిల్లీ వేసుకునే కబుర్లు చెప్పుకుంటూ, రాత్రిళ్ళు డబ్బు పెట్టి పేకాడుతూ మతాబు పువ్వులూ ఆరుకాయలుగా చీకూ చింతా లేకుండా గడిపేశాం,

ఆ పైఏడాదే. మనం బొమ్మరిల్లు కట్టి ఆగూట్లోకి ఎగిరి చక్కాపోయ్యాం. నాకు పుట్టింటి ముచ్చాటా. మీకు అత్తింటి ఆదరణ అన్నీకరువయ్యాయి. మనం దూరంకాగానే మనకు పండుగలు, పండుగ సరదాలు అన్నీదూరమయాయి,

నేను కాపురానికెళ్ళిన ఆ ఏడు - అలవాటుగా మర్చిపోయి మా నాన్న పాతిక యాభై రూపాయల సామానుకొని నెల్లాళ్ళ అవి కడుతూ కూర్చున్నాడట. మా అమ్మ వద్దంటే అగ్గిపిడుగుయిపోయి కేకలు పెట్టేసేవాడట. అమ్మా యొస్తుందనే వాట్ట - శాంపిల్సు కాల్చిచూడటానికి పిల్లలకోసం ఆశగా ఎదురు చూసేవాడట. మన పిల్లవుంటే పది మంది పిల్లలూ మనింటికొస్తారు కాని అది కాపురానికి వెళ్ళిపోయాక

పిల్లలెవరొస్తారండి మనింటికి మీకు వెర్రా పిచ్చా. అని మా అమ్మ కళ్ళు తుడుచుకునేదిట.

ఆ ఏడు టపాకాయలు కాల్చుకుందుకు ఎవరూ రాకపోయేసరికి ఆ టాంపిల్సు అన్నీ కాల్చమని మాఅమ్మనే చంపుకుతినేవాట్ట. ఆవిడ ఏ పనిలోనో వుండి విసుక్కుంటే అగ్గి రుద్రుడయి పోయేవాడు.

ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే నేను కాపరాని కెళ్ళిపోయిన తరువాత వచ్చిన దీపావళికి అరిచి కేకలేసి-ఆ సామానంతా మా అమ్మచేత కాల్పించాట్ట మా నాన్న. ఆయనకి "దీపావళి కోపం."

మా అమ్మ ఏడుస్తూ ఒక్కర్తీ అరుగుమీద ఆ టపాకాయలన్నీ కాల్చిందట మానాన్న కోసం- ముసలాళ్ళిద్దరూ చెరో అరుగుమీద బాఠా సంచా పెట్టుకుని కాలుస్తూ. ఎవరిపిల్లలయినా వస్తారేమో మనింట్లో టపాకాయలు కాల్చుకుందుకు అని ఎదురు చూశార్ట

ఘర్ ఘర్ మే దివాలీ—

ఎవరింట్లోపిల్లలువచ్చి మనింట్లో టపాకాయలు కాలుస్తారు? దే దోండ్నో---